తెలంగాణ ద్రోహి బీజేపీకి ఎందుకు ఓటెయ్యాలి?
తెలంగాణ ఏర్పాటును మోదీ కించపర్చినందుకా?
తల్లిని చంపి బిడ్డను బతికించారని చెప్పినందుకా?
తెలంగాణ ఏర్పడినందుకు 11 రోజులు పస్తులున్న
పవన్ కల్యాణతో పొత్తు పెట్టుకున్నందుకా?
తెలంగాణకు పైసా ఇవ్వనని చెప్పిన
కిరణ్ కుమార్ రెడ్డిని అక్కున చేర్చుకున్నందుకా?
తెలంగాణకు ఒక్క పైసా ఇవ్వనందుకా?

-ఎన్.చంద్రప్రకాశ్ రావు

**91827 77222**

హ్యాట్రిక్ ఎలక్షన్- హ్యాట్రిక్ కేసీఆర్ కాన్సెప్ట్‌తో అసెంబ్లీ ఎన్నికల స్పెషల్ 'తెలంగాణ జైత్రయాత్ర'కు మీ నినాదాలు పంపాల్సిన వాట్సాప్ నెంబర్ ఇదీ.. మీ పేరు పంపడం మర్చిపోకండి.

## నాడు-నేడు

• నిలువెల్లా నిర్లక్ష్యం



అయ్యా... మా దగ్గర ప్రాజెక్టుంది. దాని గేట్లకు మరమ్మతులు చేయించండి. పూడికలు తీసి కాస్త ఆధునీకరించండి. మా భూములకు నీళ్లొస్తాయి... అంటూ అధికారులు, నాయకులకు ఆనాడు సంగారెడ్డి జిల్లా నారింజ ప్రాజెక్టు పరిసరాల ప్రజలు పెట్టుకున్న విన్నపాలు విన్నవారెవరు. దీంతో ఎన్ని వర్షాలు కురిసినా ప్రాజెక్టులో చుక్కనీరు నిల్వ ఉండేది కాదు. గేట్ల లీకేజీల నుంచి వర్షపు నీరు కర్ణాటక వైపు వృథాగా పోయేది. భూగర్భ జలాలు అడుగంటి పోయేవి. నాటి రైతుల గోసను మాటల్లో వర్ణించడం కూడా కష్టమే!

• నిండుకుండ చెప్పింది సాక్ష్యం



ఎద్దు, ఎవుసం తెలిసిన పెదకాపు ముఖ్యమంత్రి అయ్యాక రైతుల మాటకు విలువ పెరిగింది. మాకు ఇది అవసరం అని వాళ్లు అడిగితే చాలు ఆయన సంతకం పని పూర్తి చేయిస్తుంది. అదే రీతిలో నారింజ ప్రాజెక్టు దశ తిరిగింది. రూ.5 కోట్లతో ప్రాజెక్టు గేట్లకు మరమ్మతులు చేయించి, పూడిక తీయించింది బీఆర్ఎస్ సర్కారు. దీంతో ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యం పెరిగింది. ఇప్పుడు 6 గ్రామాల పరిధిలో 3,200 ఎకరాల్లో ఆయకట్టుకు భరోసానిస్తున్నది ఇది. మండుటెండల్లోనూ నిండుకుండను తలపిస్తున్న ఈ జలాశయం అన్నదాతల పట్ల కేసీఆర్ చిత్తశుద్ధికి సాక్ష్యంగా నిలుస్తున్నది.

ఫన్‌టాస్టిక్

## ఓటమి కోసం ఏకమయ్యాం

'ఏంటోయ్ దిగులుగా ఉన్నావు? ఇంకా ఫలితాలే రాలేదు... అప్పుడే దిగులుకు రిహార్సల్సా?'

'మీకేంటి సార్... అమెరికా నుంచి వచ్చారు. డబ్బులిచ్చారు. టికెట్ కొట్టేశారు. ప్యారాచూట్ నాయకులు ఓడిపోతే మళ్ళీ అమెరికా చెక్కేస్తారు. నేను గాంధీ భవన్‌ను నమ్ముకొని బతుకుతున్నోడిని. గత ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా రాలేదు. ఈ సారి గ్రాఫ్ మరింత పడి పోయేట్టుగా ఉంది. నా దిగులు అదే '

'ఒక్కరు గెలువక పోయినా గాంధీ భవన్‌కు ఏమీ కాదు. ఇక్కడే ఉంటుంది. ఇలానే ఉంటుంది. నన్ను నమ్ము. తెలుగు దేశం నుంచి ఒక్కరూ గెలువలేదు. ఎన్టీఆర్ భవన్‌కు ఏమైంది. ఏమీ కాలేదు. అక్కడే ఉంది. ఎన్టీఆర్ భవన్‌లో రోజూ క్యాంటీన్ ఉంటుంది. ఉద్యోగులు ఉంటారు. అలానే మనం ఒక్కరం గెలువక పోయినా గాంధీ భవన్ ఉంటుంది.'

'గాంధీ భవన్ ఉంటుంది కానీ, ఒక్కరూ గెలువక పోతే అందులో జీవం ఉండదు కదా?'

'తమిళనాడులో కాంగ్రెస్ అప్పుడెప్పుడో స్వాతంత్ర్యం వచ్చినప్పుడు, మనం ఇంకా భూమి మీదికి రానప్పుడు అధికారంలో ఉండేది. ఆ తరువాత అంతే. అయినా అక్కడ కాంగ్రెస్ ఉంది.



కాంగ్రెస్ భవనాలు ఉన్నాయి.'

'ఒక్కరు గెలువక పోయినా గాంధీ భవన్ ఉంటుందని చెబుతున్నారు. కానీ గెలుస్తామని మాట వరసకు కూడా అనడం లేదు'

'హా .. హా .. మరీ అంత అబద్ధం ఎలా చెబుతా...'

'నాకో డౌట్ ఈ ఎన్నికల్లో పార్టీని ఎలాగైనా ఓడించాలని హేమా హేమీలందరూ కంకణం కట్టుకున్నట్టు ఉంది'

'నీకు ఆ అనుమానం ఎందుకు వచ్చింది?'

'నాయకత్వం వహించి పార్టీని గెలిపించు అని పొట్టాయనకు పార్టీ పగ్గాలు అప్పగిస్తే పిండాలు బాబూ పిండాలు చేస్తాం అని పిండారీలను గుర్తు చేస్తున్నాడు. ఆయన వల్ల వచ్చే ఓట్లకన్నా పోయే ఓట్లు ఎక్కువ'

'నిజమే ...'

'ఈయన పని తీరు చూసి కష్టకాలంలో ఆదుకుంటారు అని ఢిల్లీ నుంచి శివకుమార్‌ను పిలిస్తే... ఆయన తూగుతూ తూగుతూ ... మా కర్ణాటకలో వ్యవసాయానికి ఐదు గంటల పాటు విద్యుత్ ఇస్తాం అని అందరికీ చెప్పి వెళ్ళాడు'

'హస్తం రాష్ట్ర సారథి మూడు గంటలు అంటే, కర్ణాటక ఆయన ఐదు గంటలు అన్నాడు. రెండు ఎక్కువే కదా?'

'రెండు ఎక్కువే కానీ 24 గంటలు కరెంట్ ఇచ్చే తెలంగాణలో మూడు గంటలు, ఐదు గంటలు అంటే... అమ్మో వీళ్ళు వస్తే ఇంకేమైనా ఉందా? అని రైతులు భయపడ్డారు'

'భయం సహజమే...'

'రాష్ట్రాల నాయకులకు మాట్లాడడం రాదు. అని దేశ నాయకుడు పి.చిదంబరం వచ్చి మా వల్లే 12 వందల మంది తెలంగాణ యువత అమరులయ్యారు సారీ... చెప్పి తేనె తుట్టెను లేపారు'

'ఇలా మాట్లాడితే అలా అవుతుందని ఆయన అనుకొని ఉండరు కదా? వీళ్ల వల్ల కాదని రాహుల్ గాంధీ వచ్చారుగా...'

'ఆయన ఏం మాట్లాడుతున్నాడో అనువాదం చేస్తున్న నాయకుడికే అర్థం కాలేదు. రాహుల్ మాట్లాడేది ఒకటి, అనువాద నాయకుడు మాట్లాడేది ఒకటి. రెండిటిలో దేన్ని నమ్మాలని జనం కన్ఫ్యూజ్ అవుతున్నారు. అసలు వీళ్లంతా వచ్చి ప్రత్యర్థులకు ఆయుధాలు అందించే విధంగా మాట్లాడడం చూస్తుంటే ఓటమి కోసం ఐక్యంగా కృషి చేస్తున్నట్టు ఉంది'

'హస్తంలో ఐక్యత ఉండదు అంటారు. ఓటమి కోసం అయినా ఐక్యత ఉంది కదా... దానికి సంతోషించు.'

■ మురళి

# కరీంనగర్ కళకళ

### అన్ని రంగాల్లో ఉమ్మడి జిల్లా అభివృద్ధి • సాగు, తాగునీటి సమస్య పరిష్కారం • విద్య, వైద్యంలో సమూల మార్పులు

... ప్రకాశ్‌రావు

**తెలంగాణ ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచిన జిల్లా ఉమ్మడి కరీంనగర్. కేసీఆర్‌ను ఓడించి ఉద్యమాన్ని అణచివేయాలని ఆనాటి కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తే.. మూడుసార్లు ఎంపీగా గెలిపించి ఉద్యమానికి ఊపిరి పోసిన జిల్లా ఇది. అందుకే, కరీంనగర్ అంటే సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక అభిమానం. సమైక్య పాలనలో ఈ జిల్లాకు జరిగిన అన్యాయం గురించి సంపూర్ణ అవగాహన కలిగిన నేత ఆయన. అందుకే, 2014లో ముఖ్యమంత్రి అయ్యాక కరీంనగర్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. తాగు, సాగునీటి సమస్యలను పరిష్కరించారు. లోటు లేకుండా నిధులిచ్చి అన్ని రంగాల్లో అభివృద్ధిపథంలో నడిపించారు.**

#### తాగునీటి గోస తీరింది..

కరీంనగర్ జిల్లాలో నీటి వనరులు ఉన్నప్పటికీ కాంగ్రెస్ పాలకులు కనీస తాగునీటి అవసరాలు కూడా తీర్చలేకపోయారు. దీంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 2014కు ముందు 1106 పంచాయతీల్లోని 418 పంచాయతీల్లో నీటి కోసం నిత్యం కటకటే ఉండేది. కేసీఆర్ ప్రభుత్వం రూ.3,300 కోట్లతో మిషన్ భగీరథ పనులు పూర్తి చేసింది. కొత్తగా 1,351 వాటర్ ట్యాంకులు నిర్మించడంతో పాటు 7,692 కిలోమీటర్ల పొడవైన కొత్త పైపులైన్ ఏర్పాటుచేసింది. దీంతో తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కారమయ్యింది. ఇంటింటికీ సురక్షిత మంచినీరు అందుతున్నది. 1,126 కొత్త హ్యాబిటేషన్స్‌కు కూడా నీటి సరఫరా జరుగుతున్నది.

#### వికసిస్తున్న విద్యా రంగం..

కేసీఆర్ పాలనలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా విద్యా కేంద్రంగా మారింది. గతంలో ఇక్కడ 16 గురుకులాలు ఉండగా కొత్తగా 48 ఏర్పాటు చేశారు. మరో 29 ఇంటర్ గురుకులాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలో 2,535 పాఠశాలలుండగా ఇందులో మొదటి విడతగా 867 పాఠశాలలను 'మన ఊరు – మన బడి' కింద ఎంపిక చేసి రూ.269 కోట్లతో ఆధునీకరిస్తున్నారు. రూ.18 కోట్లతో 238 డిజిటల్ తరగతుల సదుపాయాన్ని కల్పించారు. ప్రొ.జయశంకర్ అగ్రికల్చర్ వర్శిటీ వ్యవసాయ కళాశాల, జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల, నర్సింగ్ కళాశాల, గిరిజనుల కోసం ఫైన్ ఆర్ట్స్ కళాశాల ఏర్పాటు చేశారు.

#### పెరిగిన ఉపాధి అవకాశాలు

ఉమ్మడి జిల్లాలో 2014 వరకు 588 పరిశ్రమలు ఉండగా వీటిలో 2,603 మంది పనిచేసేవారు. ఇప్పుడు కొత్తగా రూ.19,085 కోట్ల పెట్టుబడులతో 4,764 పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. 34,964 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి దొరుకుతున్నది. 2014 వరకు ఉమ్మడి జిల్లాలో రా రైస్, బాయిల్డ్ రైస్ కలిపి 542 రైస్ మిల్లులు ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య 805కు చేరింది. వరి విస్తీర్ణం భారీగా పెరగడంతో రైస్ మిల్లుల సంఖ్య పెరిగింది. ఇక్కడి యువతకు ఇక్కడే ఐటీ ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఐటీ టవర్‌ను ఏర్పాటుచేసింది.



అభివృద్ధి నగారా

#### సమృద్ధిగా సంక్షేమం

**అభివృద్ధినే** కాదు సంక్షేమాన్ని కూడా సమృద్ధిగా అందిస్తున్నది కేసీఆర్ సర్కారు. ఈ పదేండ్లలో ఉమ్మడి జిల్లాలో వేల కోట్ల రూపాయలతో సంక్షేమ పథకాలు అమలయ్యాయి. 1,19,663 మందికి కల్యాణలక్ష్మి పథకం కింద దాదాపు రూ.1,200 కోట్లు చెల్లించింది ప్రభుత్వం. దళితబంధు కింద 19,041 మందికి రూ.1,904 కోట్లు అందించింది. గొర్రెల పంపిణీ పథకం కింద రూ.620.9 కోట్లతో 58,577 యూనిట్లు పంపిణీ చేసింది. 9,516 మందికి విద్యుత్ రాయితీ కల్పిస్తున్నది. రూ.1309 .91 కోట్లతో 23,544 డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇచ్చింది.

**ఆసరా పింఛన్లు**

| 2014లో: | ఇప్పుడు: |
|---|---|
| లబ్ధిదారులు : 3,28,639 | లబ్ధిదారులు : 5,88,589 |
| ఖర్చు: నెలకు రూ.13.13 కోట్లు | ఖర్చు: నెలకు రూ.125.38 కోట్లు |



#### నీళ్లు ఫుల్.. పుష్కలంగా పంటలు..

**ఉమ్మడి** కరీంనగర్ జిల్లాలో గోదావరి నది ప్రవహిస్తున్నా కాంగ్రెస్ హయాంలో సాగు నీటికి ఇక్కడి రైతన్నలు వర్షాలపైనే ఆధారపడేవారు. కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించడంతో ఈ ప్రాంతం జల భాండాగారంగా మారింది. ఎస్సారెస్పీ పునర్జీవ పథకం, మధ్య మానేరు నుంచి ఎగువ మానేరు ప్రాజెక్టు వరకు జరిగిన పనులు, ఎస్సారెస్పీ కాలువల అధునీకరణ, చెరువుల పునరుద్ధరణతో సాగునీటి సమస్య దూరమైంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 4,283 చెరువులు ఉండగా వీటి పరిధిలో 15.73 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉండాలి. కానీ, గతంలో ఎన్నడూ చెరువుల్లో పూడిక తీయకపోవడంతో అరకొరగానే నీరు నిలిచేది. చెరువుల కింద 2 లక్షలకుపైగా ఆయకట్టు ఉంటే.. ఏనాడూ 80 వేల ఎకరాలకు మించి పారలేదు. కేసీఆర్ ప్రభుత్వం మిషన్ కాకతీయ కింద 1,833 చెరువులను ₹741.18 కోట్లతో పునరుద్ధరించింది. దీంతో నీటి నిల్వ సామర్థ్యం 19.93 టీఎంసీలకు చేరింది. ఫలితంగా చెరువులు, కుంటల కింద ప్రస్తుతం 1,98,588 ఎకరాల ఆయకట్టులో రెండు పంటలూ పుష్కలంగా పండుతున్నాయి.

**ఉమ్మడి జిల్లాలో సాగు విస్తీర్ణం**

2014లో: **11,79,013 ఎకరాలు..**

ఇప్పుడు: **22,41,066 ఎకరాలు**

#### ప్రజలకు చేరువైన వైద్యం..

**కాంగ్రెస్** పాలనలో సర్కారు వైద్యాన్ని నిర్లక్ష్యం చేశారు. ప్రభుత్వ దవాఖానలు అంటేనే భయపడేలా మార్చేశారు. కేసీఆర్ సర్కారు వైద్యానికి ప్రాధాన్యతనిచ్చి కొత్త దవాఖానలు నిర్మించింది. ఉమ్మడి జిల్లాలో 24 ఎమర్జెన్సీ ఆరోగ్య కేంద్రాలు, 326 పల్లె, 19 బస్తీ దవాఖానలు, 10 మహిళా ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసింది. గతంలో ఉమ్మడి జిల్లాలో ఒక్క ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఉండేది కాదు. ఇప్పుడు ప్రభుత్వం 500 సీట్లతో నాలుగు మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసింది. వీటికి అనుబంధంగా దవాఖానలను అందుబాటులోకి తెచ్చింది.

**ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ వైద్య సదుపాయాలు**

| | 2014లో | ఇప్పుడు |
|---|---|---|
| ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు | 77 | 93 |
| పడకలు | 1342 | 2,850 |
| వైద్య సిబ్బంది | 3,149 | 4,218 |

#### రోడ్లు తళతళ..

**కాంగ్రెస్** పాలనలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రోడ్ల పరిస్థితి దయనీయంగా ఉండేది. జిల్లా కేంద్రం నుంచి ముఖ్యమైన పట్టణాలు, మండలాలకు కూడా సింగిల్ రోడ్లే ఉండేవి. ఇక, గ్రామాల్లో పంచాయతీరాజ్ రోడ్లు మొత్తం గుంతలే. కేసీఆర్ ప్రభుత్వం ఈ పదేండ్లలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రూ.6,500 కోట్లతో రోడ్ల నిర్మాణం పూర్తి చేసింది. అన్ని మండల కేంద్రాలకు డబుల్ రోడ్లు నిర్మించింది. గ్రామాల్లో రోడ్లు బాగు చేయించింది.

**ఉమ్మడి జిల్లాలో రోడ్ల స్వరూపం**

| | డబుల్ రోడ్లు: | సింగిల్ రోడ్లు: |
|---|---|---|
| 2014లో: | 2,339.7 కి.మీ.లు | 3,612.4 కి.మీ.లు |
| ఇప్పుడు : | 3,504.9 కి.మీ.లు | 5,913 కి.మీ.లు |

## ఏడు పదులు దాటినా.. ఎన్నికల బరిలో

ప్రజాసేవకు, రాజకీయాలకు రిటైర్‌మెంట్ లేదు. ప్రజల్లో గుర్తింపు ఉంటే ఓపిక ఉన్నంత వరకు ప్రత్యక్ష రాజకీయాల్లో ఉండొచ్చు. ఇప్పుడు జరుగుతున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల బరిలోనూ ఏడు పదుల వయస్సు దాటిన అభ్యర్థులు దిగారు. ఇప్పటికే అనేక పర్యాయాలు ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా పని చేసి ఇప్పుడు మరోసారి అదృష్టం పరీక్షించుకుంటున్నారు. దీంతో వీరు పోటీ చేస్తున్న నియోజకవర్గాల్లో రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి.

#### పోచారం శ్రీనివాస్‌రెడ్డి



మంత్రిగా, స్పీకరుగా పనిచేసిన పోచారం శ్రీనివాసరెడ్డి ఈ ఎన్నికల్లో మరోసారి బాన్సువాడ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. పోచారం వయస్సు 74 ఏండ్లు. ఇప్పటికే ఆయన ఆరుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2009 నుంచి వయన వరుసగా నాలుగుసార్లు విజయం సాధించారు. ఇప్పుడు ఆయన గెలిస్తే వరుసగా ఐదోసారి గెలిచినట్టు అవుతుంది. మూడుసార్లు మంత్రిగా పని చేసిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రస్తుతం అసెంబ్లీ స్పీకర్‌గా ఉన్నారు.

#### అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



నిర్మల్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి వయస్సు 74 ఏండ్లు. ఆయన 1996, 1999, 2004, 2014, 2018లో నిర్మల్ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. రెండుసార్లు పార్లమెంటు సభ్యుడిగా కూడా ఎన్నికయ్యారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్‌గా పని చేశారు. ప్రస్తుతం ఆయన మంత్రిగా కొనసాగుతున్నారు.

#### వనమా వెంకటేశ్వరరావు



కొత్తగూడెం నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన వనమా వెంకటేశ్వరరావు వయస్సు 70 ఏండ్లు. ఇంతకు ముందు ఆయన 1989, 1999, 2004, 2018 ఎన్నికల్లో విజయం సాధించారు. ఇప్పుడు ఆయన గెలిస్తే ఐదోసారి గెలిచినట్టు అవుతుంది. గతంలో వనమా వెంకటేశ్వరరావు ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా, వైఎస్సార్ క్యాబినెట్‌లో మంత్రిగా పని చేశారు.